క్లుప్తంగా

నోటి శుభ్రతతో చక్కటి జీర్ణ వ్యవస్థ

కాకినాడ రూరల్: నోటి శుభ్రత లేకుంటే ఆ ప్రభావం జీర్ణ వ్యవస్థపై పడుతుందని దంత వైద్యుడు సువర్ణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చక్కని జీర్ణ వ్యవస్థకు నోటి ఆరోగ్యం ప్రధానమని, పళ్లలో రంధ్రాలు ఏర్పడినా, దంతాలు పుచ్చిపోయినా, లాలాజలం సరిగా ఉత్పత్తి కాకపోయినా జీర్ణవ్యవస్థ కుంటుపడుతుందన్నారు. దంతాలను రెండు పూటలా బ్రష్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: రొయ్యల చెరువుల వద్ద పాము కాటు వేయగా, కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు మండలం కొంగోడు గ్రామానికి చెందిన జంపన సత్యనారాయణరాజు (59) అదే గ్రామంలో గొట్టుముక్కల నాగరాజు రొయ్యల చెరువుల వద్ద కాపలదారుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న సాయంత్రం చెరువుల వద్దకు అతడు కాపలాకు వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో సత్యనారాయణరాజును గుర్తు తెలియని పాము కాటు వేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే అతని కుమారుడు మనోజ్‌కుమార్ కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం తీసుకెళ్లాడు. సత్యనారాయణరాజు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ టి.సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం రికార్డు ఈఓకు అప్పగింత



ఈఓ సుబ్బారావుకు బంగారం రికార్డులు అప్పగిస్తున్న పూర్వ ఈఓ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన బంగారం, ఇతర ఆభరణాల రికార్డులను పూర్వ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి ప్రస్తుత ఈఓ వీర్ల సుబ్బారావుకు మంగళవారం అప్పగించారు. దేవస్థానానికి ఈఓలు మారినపుడు పాత ఈఓ నుంచి కొత్త ఈఓకు ఈ బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీ. 2022–23 మధ్య ఈఓగా ఉన్న సత్యనారాయణమూర్తి ప్రస్తుతం ద్వారకా తిరుమల ఈఓగా పనిచేస్తున్నారు. ఆయన 2023 మార్చిలో బదిలీ అయ్యాక ఇక్కడ ఈఓలుగా చంద్రశేఖర్ అజాద్, కె.రామచంద్రమోహన్ పనిచేసినప్పటికీ, వివిధ కారణాలతో వారికి ఈ రికార్డులు అప్పగించలేదు. ఇప్పుడు వాటిని ఈఓ సుబ్బారావుకు అప్పగించారు. దేవస్థానం డీసీ చంద్రశేఖర్, దేవదాయ శాఖ జిల్లా ఆభరణాల తనిఖీ అధికారి(జేవీఓ) వీవీ పల్లంరాజు, ఏఈఓ భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సైకిల్ యాత్రకు స్వాగతం

అన్నవరం: దేశ భద్రత, సమైక్యత ఆవశ్యకతను చాటుతూ సమృద్ సంరక్షణ పేరుతో పశ్చిమ బెంగాల్‌లోని బక్కాహలి నుంచి కన్యాకుమారి వరకు సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం రాత్రి అన్నవరం చేరింది. సుమారు 2,700 కి.మీ. 60 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఈ యాత్ర చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్రకు సర్పంచ్ ఎస్ కుమార్‌రాజా, ఎస్సై శ్రీహరిబాబు, విశ్రాంత ఆర్‌ఐ ప్రసాద్, పలు సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సత్యదేవ కళాశాల మైదానంలో వీరిని సన్మానించారు.

అందరితో మర్యాదగా ప్రవర్తించాలి

ప్రత్తిపాడు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనాలను పరిశీలించారు. ముఖ్యమైన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ల్యాండ్‌లైన్ నంబర్, ఎస్సై, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫోన్ నంబర్లను అన్ని కార్యాలయాలు, వసతిగృహాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ముఖ్యమైన బహిరంగ ప్రదేశాలల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళా కేసుల్లో సిబ్బంది సత్వరమే స్పందించాలని, పోలీస్ స్టేషన్‌లో వారికి న్యాయం జరుగుతుందనే మనోధైర్యం కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. గంజాయిపై నిఘా పటిష్టపరచి, క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్సై ఎస్.లక్ష్మీకాంతంకు సూచించారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఉన్నారు.

ఉపాధే పరమావధి

- అప్రెంటిస్ కల్పనకు ప్రత్యేక చర్యలు
- గత ప్రభుత్వంలో ఆధునీకరణకు రూ.2.76 కోట్ల నిధులు
- బోధనా పరికరాల అప్‌గ్రేడ్‌కు కేటాయింపు



సాంకేతిక విద్యలో మెళకువలు నేర్చుకుంటున్న ఐటీఐ విద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో గత ఐదేళ్లుగా వంద శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి. ఐటీఐ అడ్మిషన్లకు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా అన్ని కోర్సులలో ప్రవేశాలు కల్పించారు. దానికి కారణం ఆధునిక బోధనకు చర్యలు తీసుకోవడమే. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరతున్నా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐ కళాశాల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా నిధులు లేక నిర్వీర్యమైన కళాశాల తాజా పరిస్థితితో విద్యాబోధనకు వచ్చిన కొత్త పరికరాలు కనుగోలు చేసి విద్యార్థులను అప్‌గ్రేడ్ చేశారు. ఎప్పటి నుంచో ఉన్న పాత ప్రాక్టికల్ పరికరాల స్థానంలో కొత్తవి కనుగోలు చేస్తున్నారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే పక్కా ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ) కోర్సులు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పలు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఈ కోర్సులు దోహదపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విద్యాసంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. కాకినాడ ఐటీఐలో అన్ని విభాగాల్లో కలిపి 1080 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

కాకినాడ ఐటీఐలో కోర్సులు ఇవే..

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), కోపా, ఆర్ అండ్ ఏసీ, ట్రేడులు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రెంటిస్ పూర్తిచేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

విద్యతో పాటు ఉపాధి



కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో విద్యను పూర్తిచేసిన వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాము. ముఖ్యంగా పలు ప్రైవేట్ కంపెనీలను సంప్రదించి అప్రెంటిస్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఐటీఐకు రూ.2.76 కోట్లు విడుదల చేశాం. ప్రారంభ దశలో వేతనంతో సంబంధం లేకుండా ముందు పని అనుభవం కోసం ఉద్యోగంలో చేరేలా ప్రోత్సహిస్తున్నాం. పురాతన విద్యకు స్వస్తి పలికి మారిన కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులలో విద్యా బోధన సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ.2.47 కోట్లతో మోటర్ మెకానిక్ విభాగం, ఎలక్ట్రానిక్స్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ విభాగాలు ఆధునీకరించాం.

– ఎం.వేణుగోపాల వర్మ, ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

బాలాజీచెరువు: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశ్రుభం చేశారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ విద్యార్థుల సహకారంతో 200 మంది వలంటీర్లు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సేకరించారు. ప్లాస్టిక్ నిషేధించి క్లాత్ సంచులను వినియోగించాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతి నెలా 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ కోరారు.

వాహనాలకు ఇంధనం పోయండి

- వేతన బకాయిలు సత్వరం చెల్లించండి
- క్లాప్ డ్రైవర్ల నిరసన



ధర్నా చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

బోట్‌క్లబ్: నగర పాలక సంస్థ పరిధిలో నిత్యం తడి, పొడిచెత్త సేకరించే క్లాప్ వాహనాలకు మార్చి 1 నుంచి గ్యాస్, పెట్రోల్ వేయించకపోవడం వల్ల నిలిచిపోయాయని తక్షణమే వాటికి ఇంధనం సమకూర్చి నడిపించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జగన్నాథపురం వాహనాల యార్డ్ వద్ద డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ నగరంలో క్లాప్ వాహనాలు చెత్త సేకరణలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం వల్ల ఆ వ్యవస్థ కొనసాగుతుందా లేదా అని ఉపాధి భద్రత విషయంలో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నామన్నారు. నగర పాలక సంస్థ రూ.30 లక్షలు పంపించినా కాంట్రాక్టు సంస్థకు జమ కాలేదని చెబుతున్నారన్నారు. మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి ఆ వాహనాలు నడిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, 2024 జనవరి నుంచి వారి జీతాల నుంచి మినహాయించిన పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాలకు జమ చేయాలన్నారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలన్నారు. జీవో ప్రకారం క్లాప్ వాహన డ్రైవర్స్‌కు రూ.24,500 కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకట రమణతో పాటు క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు నక్కా గంగాధర్, బి.శివశ్రీను, ఎం.శివ శంకర్, వి.అరుణ్ కుమార్, వై.దుర్గా ప్రసాద్, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులకు రక్షణ

- హైకోర్టు ఆదేశం అభినందనీయం
- రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల



రమణయ్యపేటలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్

కాకినాడ రూరల్: పంచాయతీలలో ఆస్తులను గుర్తించి జిల్లా గెజిట్‌లో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించడం అభినందనీయమని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో చెరువు భూములు, సామాజిక స్థలాలు, మరుగుదొడ్లు, వంటి స్థలాలను కబ్జా చేస్తున్నా పంటించుకునే నాథుడు లేడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల క్రితమే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసిందని, ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని, హైకోర్టు తీర్పును అనుసరించి జిల్లా గెజిట్‌లో ప్రచురించడం వలన పంచాయతీ స్థలాలకు రక్షణ కలుగుతుందన్నారు.

ఆట వస్తువుల బహూకరణ



జీజీహెచ్ ఎన్ఆర్‌సీ కేంద్రానికి ఆట వస్తువులను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అదానీ ఫౌండేషన్ ఫార్చ్యూన్ సుపోషణ్‌లో భాగంగా స్థానిక జీజీహెచ్‌లో ఉన్న పోషకాహార పునరావాస కేంద్రంలో ఉన్న పిల్లలకు ఆటవస్తువులు, మెదడు అభివృద్ధికి దోహదపడే ఆట వస్తువులను ఆ సంస్థ మేనేజర్ శరవణ్ చేతుల మీదుగా ఉచితంగా ఎన్ఆర్‌సీ విభాగ హెడ్ మాణిక్యాంబకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాంబ మాట్లాడుతూ అదానీ సుపోషణ కార్యక్రమం ఎంతో మందికి ఉపయోగపడుతుందని, ఎన్ఆర్‌సీ సేవలు అవసరం ఉన్న వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదానీ ఫౌండేషన్ అందించిన ఆట వస్తువులు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ ప్రతినిధి జనార్దన్, సిబ్బంది, జీజీహెచ్ ఎన్ఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు మంజూరులో చేతివాటం!

బంధన్ బ్యాంక్ సిబ్బందిపై మహిళల ఆరోపణ



వలసపాకలలోని బంధన్ బ్యాంక్

కాకినాడ రూరల్: గ్రూపులుగా ఏర్పడి వస్తే వారి సిబిల్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తూ బ్యాంకింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న బంధన్ బ్యాంక్‌కు చెందిన కొందరు సిబ్బంది లంచాలు తీసుకుంటున్నారని మహిళలు ఆరోపించారు. చర్చనీయాంశమైన ఈ బ్యాంక్ కాకినాడ బ్యాంకింగ్ యూనిట్ రూరల్ మండలం వలసపాకల గ్రామంలో ఉంది. సుమారు ఏడేళ్ల క్రితం దీనిని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ బ్రాంచ్ ద్వారా సుమారు 300 మహిళా గ్రూపులు రుణాలు పొందుతున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం గ్రూపుగా ఏర్పడి వస్తే ఒక్కో గ్రూపునకు మొదటిగా రూ.3.5 లక్షలు వరకు అందిస్తున్నారు. సక్రమంగా చెల్లింపులు చేపడితే తరువాత సంవత్సరం మరింత రుణం అధికంగా అందస్తున్నారు. ఒక్కో గ్రూపులో ఒక్కో మహిళకు దాదాపు రూ.35వేలు అందుతుండగా ఏడాదిలో 48 వారాలు పాటు వాయిదాలు రూపంలో అసలు, వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు వడ్డీ 22 శాతం అవుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఇదంతా వ్యాపారంలో భాగమైతే, ఇక్కడ బ్రాంచ్‌లో గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు అందించేందుకు, తిరిగి నెల నెలా వాయిదాలు వసూళ్ల నిమిత్తం మేనేజరుతో సహా ఏడుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రుణాల మంజూరు కోసం తమ వద్ద నుంచి లంచాలు తీసుకున్నారని, ఇద్దరు సిబ్బందిపై దుమ్ములపేటకు చెందిన శ్రీనివాస, చిన్నమాంద–1, చిన్నమాంద–2 గ్రూపుల నుంచి సుమారు రూ.5 లక్షలు పైగా లంచాలు తీసుకున్నట్టు ఆయా గ్రూపులకు చెందిన సూర్య కుమారి, అమ్ములు సంబంధిత బ్యాంక్ మేనేజర్ సూరిబాబుకు తెలియజేశారు. రుణాలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నట్టు సూర్య కుమారి ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లామని, బాధితులు, సిబ్బందిని ఎదురెదురుగా ఉంచి బుధవారం మాట్లాడతామని సూరిబాబు తెలియజేశారు.

మీటర్ రీడర్ల ఆందోళన

జగ్గంపేట: ప్రీపెయిడ్ మీటర్ల వల్ల తమ ఉపాధి దెబ్బ తింటోందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట డీఈ కార్యాలయం వద్ద మీటర్ రీడర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. తమ ఉపాధికి ఇబ్బంది కలగకుండా చేయాలనిచ ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరుతూ డీఈ వీరభద్రరావుకు వినతి పత్రం సమర్పించారు. మీటర్ రీడర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని డీఈ తెలిపారని జగ్గంపేట మీటర్ రీడర్ల సంఘ డివిజన్ అధ్యక్షుడు పసగడుగుల నానాజీ తెలిపారు.



జంతు, వృక్ష జాతుల విశేషాలను తెలిపేలా ఏర్పాట్లు



ప్రత్యేక ఆకర్షణగా వివిధ రకాల బొమ్మలు



కోరంగి అభయారణ్యం స్వాగత ద్వారం వద్ద పర్యాటకుల సందడి

ప్రకృతి ఒడి.. అందాల ఒరవడి

- మడ అడవుల్లో పర్యాటకుల సందడి
- పర్యాటక ప్రదేశాలకు అదనపు హంగులు
- వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- అలరించనున్న బోటు షికార్



ఉర్రూతలూగించే బోటు షికార్



రంగులు వేస్తున్న కళాకారులు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరింగ అభయారణ్యం వేసవి సందడికి ముస్తాబవుతోంది. ఏటా వేసవి తాపం నుంచి ఉపశమనం, ఆహ్లాదం పొందేందుకు అధిక శాతం మంది అభయారణ్యానికి వస్తుంటారు. ప్రకృతి ఒడిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు అభయారణ్యం వేదిక కాబోతుంది. సందర్శకులను మరింత ఆకర్షించడంతో పాటు, వినోదాన్ని పంచేవిధంగా అటవీ శాఖ మరిన్ని ఏర్పాట్లు చేస్తోంది. వేసవిలో పెరగనున్న సందర్శకుల కోసం అదనపు హంగులు దిద్దుతున్నారు. ప్రత్యేక సౌకర్యాలతో, పర్యాటక ప్రాముఖ్యాన్ని తెలియజేసేలా రంగులు వేస్తూ, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తికావడం, త్వరలో పదో తరగతి, ఇతర పరీక్షలు పూర్తి కానున్న నేపథ్యంలో అభయారణ్యానికి సందర్శకుల తాకిడి అధికమవుతుంది.

ప్రత్యేక చర్యలు

పర్యాటకులు సరదాగా గడిపేందుకు అటవీ శాఖ ఇక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ప్రకృతి ఒడిలో మడ చెట్ల నడుమ చల్లటి ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా గడపడం పర్యాటకులకు మరచిపోలేని అనుభూతి నిస్తుంది. సందర్శకుల కోసం తాగునీరు, తినుబండరాలు, శీతల పానీయాల దుకాణాలను కూడా ఏర్పాటు చేసింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్, మత్స్య, పక్షిజాతులను వీక్షించేలా అక్వేరియం, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే విధంగా ప్రకృతి స్టాళ్లను ఏర్పాటు చేశారు.

బోటు షికార్.. క్రీక్ విజిట్‌లు

పర్యాటకులకు బోటు షికార్ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి మడ అడవుల అందాలతో పాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాల పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీకు(పిల్ల కాలువలు)ల్లో పర్యాటకులు బోట్లపై సందర్శించేవిధంగా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

సందర్శకుల కోసం ఏర్పాట్లు



వేసవిలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత ఆనందాన్ని అందించేందుకు అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రకృతి అందాలతో పాటు, ఇక్కడ విశేషాలను అందరికీ తెలిసేవిధంగా మినీ థియేటర్, ప్రకృతి ప్రేమికుల కోసం అక్వేరియం, ప్రకృతి స్టాళ్ల ఏర్పాటు చేశాం. చిన్నారుల ఆటపాటల కోసం అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేసి, అభయారణ్యాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాం.

– సిద్ధార్థ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, కోరింగ అభయారణ్యం

సురక్షితంగా బోటు షికార్



సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించేలా అభయారణ్యాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నాం. పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు ఏర్పాటు చేసి, రంగురంగులతో సిద్ధం చేస్తున్నాం. పాడైన చెక్క వంతెనల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నాం. గోదావరిలో సురక్షిత బోటు షికార్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. లైఫ్ జాకెట్ వేసుకున్న వారిని మాత్రమే బోటు షికారుకు అనుమతిస్తాం. పోర్టు అధికారుల అనుమతులు, నిబంధనల మేరకు బోటు షికార్ నిర్వహిస్తున్నాం. అభయారణ్యం సందర్శనం మరింత అనుభూతినిచ్చేలా ఏర్పాట్లు చేశాం. – **ఎస్ఎస్ఆర్ వరప్రసాద్**, ఫారెస్ట్ రేంజర్, కోరింగ అభయారణ్యం

పారిశ్రామిక ప్రగతిపై జాతీయ సదస్సు

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రగతిపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ – గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఈ సంస్థ చైర్మన్ టి.శివశంకరరావు పాల్గొంటారన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు, వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పాల్గొంటారన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులలో 16 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 22 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 16 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 22 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.